మినీకథ

# ప్రేమ ముదిరింది.

—ప్రేమ్‌దులారి

కథ చదవడం పూర్తి చేసిన విమల చిరాగ్గా చేతిలోని పత్రికని ఎదురుగా వున్న టీపాయ్ మీదకి గిరాటువేసింది.

భర్త ఇంకా రాలేదని అసహ్యంగా ఎదురు చూస్తున్న ఆమె కాలక్షేపానికి ఎదురుగా వున్న పత్రికనందుకుని తిరగెయ్యడం ప్రారంభించింది. ఆ కథ మొదలు చదవగానే ఎందుకో చదవాలనిపించి ఒక్క బిగిన పూర్తి చేసింది



భర్త చేసింది తప్పు–

మరి అతడి ప్రేమని తిరిగి పొందడానికి ఆమె చేసింది...?

తన సంసారాన్ని నిలుపుకోవడానికి మరో సంసారంలో నిప్పులు పోయవచ్చా?

ఇదేనా ఈ రచయిత్రి ఇవ్వదల్చుకున్న సందేశం... ఇలాంటి కథల వల్ల జీవితాలు బాగుపడవు. మరింత అఘాధంలోకి జారిపోతాయి...

వీధి గుమ్మం దగ్గరకు వెళ్ళింది...

ఎక్కడా భర్త వస్తున్న జాడలేదు. తిరగివచ్చి సోఫాలో కూలబడింది.

ఇంతకుముందు ఆఫీసయ్యీ అవకముందే ఇంటికి వచ్చేసే భర్త ఇప్పుడెందుకు ఆలశ్యంగా వస్తున్నాడు?

కొంపదీసి కొత్త స్నేహాలు ప్రారంభించలేదు కదా? ఆమె ఆలోచన్లు ఆమెకే వికృతంగా అనిపించాయి.

ఏమిటి తన ఆలోచనలు ఈరోజు ఇలా సాగుతున్నాయి...

చెప్పడు మాటలు, వెకిలి చేష్టలేకాదు వికృతపు రాతలూ మనసుని ఎలా ఇబ్బంది పెడతాయో ఆమెకి అర్థమైంది.

బలవంతాన ఆ ఆలోచనల్ని అణచుకుంటూ భర్త వస్తున్నాడేమోనన్న ఆలోచనతో గుమ్మం దగ్గరకి వచ్చింది.

మెట్ల మీద ఏవో అడుగుల శబ్దం వినిపించడంతో అటు చూసింది. ఆ అడుగుల శబ్దం భర్తది కాదు పై ఫ్లాట్‌లో వుంటున్నాయనది.

అంతవరకూ అటూ ఇటూ చూస్తు వస్తున్నవాడల్లా తనని చూడగానే తలవంచుకుని మెట్లెక్కసాగాడు.

విమలకి తనంతకు ముందు చదివిన కథ గుర్తుకొచ్చింది. మరోసారి తన ఆలోచనలు తనకే జుగుప్సగా అనిపించాయి.

మనిషి ముఖం మీద తలుపువేసి లోపలికెళ్ళడం సభ్యత కాదు. అందుకని అక్కడనుకుని లోపలికి వచ్చింది కాని తలుపులు వెయ్యలేదు.

ఈ ఆలోచనల మధ్య భర్త రాకని గమనించలేదు విమల.

ఎప్పుడూ వేసుండే తలుపులు అప్పుడెందుకు తీసి వున్నాయి? తను వచ్చేముందు ఎవరో పైకి వెళ్తున్న అడుగుల చప్పుడు వినిపించింది. విమల అతడిని చూడడానికిగాని, మాట్లడడానికిగాని తలుపులు తీసివుంచలేదు, కదా?

ఒక్కసారిగా అతడి మనసు విషపూరితమైంది.

తను ఆఫీసు నుంచీ వస్తుంటే క్లాసమేట్ రజని కనిపించింది. ఆనందంతో పలకరించింది. ఇంటికీ పిలుచుకు వెళ్ళింది. అందుకే ఆలస్యమైంది. ఆమె చూపించిన అభిమానాన్ని అతని మనసు అపార్థం చేసుకుంది. ఆమె భర్త రోజూ ఆలస్యంగా వస్తాడని తెలుసుకుని రేపు ఆమె దగ్గరకు వెళ్ళాలనుకున్నాడు...ఆ పరిచయాన్ని ఇంకా ఏవేవో మలుపులు తిప్పాలనుకున్నాడు...ఇంతవరకూ అలాంటి ఆలోచనలలో సతమతమైపోతున్న అతడికి తన భార్య మీద అనుమానం అకారణంగా రాకేమీ చేస్తుంది?

విమల ఇంత సంస్కారహీనంగా ప్రవర్తిస్తుందా? ఈ ప్రశ్న మెదడులోకి రాగానే మరింతకు ముందు నీ ఆలోచన లేమిటి? అతడి మనసు అతడిని తిరిగి ప్రశ్నించేసరికి ఉక్కిరిబిక్కిరయ్యాడు నవనీతరావు.

ఇంతకుముందు తను ఆలోచించిన ధోరణి తనకే అసహ్యంగా అనిపించింది. రజని విషయంలోను, విమల విషయంలోనూ కూడా! ముందు తనని తాను ప్రక్షాళన చేసుకోవాలి. లేకపోతే ఈ విపరీత ధోరణి మరింత వెర్రితలలు వేసే ప్రమాదం లేకపోలేదు–

ఈ ఆలోచన తర్వాత అతని మనసు కొద్దిగా తేలికైంది.

రేపు రజని ఇంటికి వెళ్ళాలి. కానీ ఒక్కడే కాదు– విమలతో కలిసి వాళ్ళిద్దర్నీ కూడా ఇంటికి ఆహ్వానించాలి–

అంతవరకూ చాలా భారతంగా అనిపించిన మనసు పూర్తిగా తేలికైపోయింది.

ఇప్పుడిద్దరిలోనూ ఎటువంటి విపరీత ఆలోచనలు లేవు.

●